క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: స్థానిక ఏబీఎం కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ మాజీ కన్వీనర్ గుంతా సామ్యేల్ గుండెపోటుతో మృతి చెందాడు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు సామ్యేల్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తాతపూడి ఐజయ్య, సర్పంచ్ తండ్రి బుద్దుల ప్రేమానంద్, నాయకులు ఉన్నారు. మృతుడికి భార్య ఝాన్సీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు సీసీ, బీటీ రోడ్ల ప్రారంభం

బేస్తవారిపేట: మండలంలోని ముక్తీశ్వరం నుంచి ఖాజీపురం వరకు రూ.2.60 కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీ, బీటీ రోడ్డును ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి తెలిపారు. రూ.80 లక్షలతో ఖాజీపురం నుంచి చెరువుకట్ల మీదుగా కొత్తపేటకు రూ.80 లక్షలతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన, ఎంపీ చెరువులో సచివాలయం, ఆర్బీకే, బసినేపల్లెలో సచివాలయం, హెల్త్ సబ్‌యూనిట్ సెంటర్ ప్రారంభించనున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు ప్రజావేదిక

కొనకనమిట్ల: ఉపాధి హామీ పథకం పనుల అమలు తీరుపై ఆదివారం సామాజిక ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ బుల్లెన్నరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం అమలు తీరుపై, ఇటీవల గ్రామాల్లో సామాజిక తనిఖీలపై క్షేత్రస్థాయిలో గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామ సభల్లో చర్చించిన అంశాలపై జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

ఏపీజీబీలో డిపాజిట్లపై అత్యధిక వడ్డీ

బేస్తవారిపేట: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ కె.రామ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీజీబీలో డిజిటల్ లావాదేవీలు చేసుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఆర్థిక అవగాహన కలిగి ఉండాలని కోరారు. బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు కేసీహెచ్ వెంకట్రామయ్య, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ పార్వతి


ఎంపీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీఓ పార్వతి

బేస్తవారిపేట: ఎంపీడీఓగా టి.పార్వతి శనివారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్ అండ్ ఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై ప్రకాశం జిల్లాకు పార్వతి వచ్చారు. జెడ్పీ సీఈఓ బేస్తవారిపేట మండలానికి ఎంపీడీఓగా పోస్టింగ్ ఇచ్చారు. ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నూతన ఎంపీడీఓకు అభినందనలు తెలిపారు.

ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న సైదులు


బాధ్యతలు స్వీకరిస్తున్న సైదులు

పొదిలి: స్థానిక పోలీసుస్టేషన్ ఎస్ఐగా వెంకట సైదులు శనివారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. పొదిలిలో ఎస్ఐగా పనిచేస్తున్న మల్లికార్జునను పదోన్నతిపై ఒంగోలు ట్రాఫిక్ సీఐగా నియమించారు. ఏర్పడిన ఖాళీలో ఒంగోలులో పనిచేస్తున్న సైదులును నియమించారు. సైదులును పోలీసులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

అర్ధవీడు ఎస్ఐగా నాగమల్లేశ్వరరావు

అర్ధవీడు (కంభం): అర్ధవీడు ఎస్ఐగా నాగమల్లేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన వెంకటేశ్వరనాయక్ మార్కాపురం రూరల్ స్టేషన్‌కు బదిలీ అయిన నేపథ్యంలో కంభం ఎస్ఐగా పని చేస్తున్న నాగమల్లేశ్వరరావును అర్ధవీడుకు బదిలీ చేస్తూ ఎస్పీ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ నాగమల్లేశ్వరరావు

గ్రామ స్వరాజ్యం ఘనత సీఎం జగన్‌దే

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: దేశ చరిత్రలోనే గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం రెండో రోజు పొదిలి మండలం కంభాలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గడప గడపకు వచ్చిన అధికారులు, నాయకులకు మాజీ ఎంపీపీ కోవెలకుంట్ల నరసింహారావు అధ్వర్యంలో పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఏం తాతా బాగున్నావా!అవ్వా బాగున్నావా అంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ అందజేసిన సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అర్హులైన ప్రజలందరికీ కులం,మతం, పార్టీ బేధం లేకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా గమనించాలని ప్రజలను కోరారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకుని దాచుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కావాలంటే పచ్చ జెండాలు పట్టుకుని నాయకులు చుట్టూ ప్రదక్షిణం చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు పథకాల్లో పేదలకు ఇళ్ల, ఇంటి స్థలాలు, రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, చదువుకోనే పిల్లల కోసం అమ్మవడి, విద్యాకానుక, వసతి దీవెన పథకాలు అందిస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్న నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారన్నారు. కాలనీలో తాగునీరు, సైడుకాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. దాదాపు 200 గృహాలను సందర్శించారు. నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, పార్టీ రాష్ట్రకార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనరు గొలమారి చెన్నారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాయి రాజేశ్వరరావు, గూడూరి వినోద్, ఫిరోజ్, పులిగొర్ల శ్రీనివాసులు, వెంకట నారాయణరెడ్డి, మాల్లాపురం నరసింహులు, బసిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, నాగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముల్లా జాకీర్, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఓవరాక్షన్


కొనకనమిట్లలో కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

మార్కాపురం: స్కిల్ డెవలప్‌మెంటు కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని సీఐడీ పోలీసులు నంద్యాలలో అరెస్టు చేసి విజయవాడ తరలించే క్రమంలో మార్గమధ్యంలో ఆ పార్టీ నాయకులు శనివారం ఓవరాక్షన్ చేశారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తుపై వదిలి పెట్టారు. పట్టణంలో మార్కాపురం, వై.పాలెం టీడీపీ ఇన్‌చార్జిలు కందుల నారాయణరెడ్డి, ఎరిక్షన్‌బాబును అరెస్టు చేశారు. ద్వితీయ శ్రేణి నాయకులు పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తుండగా వారిని ఎస్ఐ శశికుమార్ అదుపులోకి తీసుకుని పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించి కొద్దిసేపటి తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై వదిలి పెట్టారు. చంద్రబాబునాయుడుని నంద్యాలలో అరెస్టు చేసి విజయవాడకు తరలించే క్రమంలో నియోజకవర్గంలోని తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆయా పోలీసుస్టేషన్ల సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పక్కా ఆధారాలతో సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్టు చేసినా టీడీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ భవన్ మంజూరుపై హర్షం

మార్కాపురం టౌన్: పట్టణంలోని బీసీలందరికీ కలిపి బీసీ భవన్‌ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు అన్నారు. బీసీల ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కేపీని ఘనంగా సన్మానించారు. బీసీ భవన్‌కు పూలసుబ్బయ్య కాలనీలో 1300 గజాల స్థలాన్ని కేటాయిస్తూ ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నారని పీఎల్‌పీ యాదవ్ తెలిపారు. బీసీ భవన్ నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. బీపీ మండల్ యాదవ్ విగ్రహం ఏర్పాటుకు కూడా ఎమ్మెల్యేతో పాటు చైర్మన్ కూడా ఆమోదం తెలిపారన్నారు. బీసీ సంఘ నాయకులు రంగస్వామి గౌడ్, నల్లబోతుల అచ్చయ్య, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, టీపీ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ ప్రసాద్, బండారు శ్రీను, అల్లం రాజు శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీల ఆధ్వర్యంలో సన్మానం

పట్టణానికి అంబేడ్కర్ భవన్‌ను మంజూరు చేయించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని శనివారం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమ్‌కుమార్, సతీష్, చెన్నకేశవులు, ఎం.శ్రీనివాసులు, వంశీ, రోజ్‌లిడియా కలిసి సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

డీఎంకే నేతపై చర్యలు తీసుకోవాలి


ర్యాలీలో పాల్గొన్న హిందూ సంఘాల ప్రజలు

మార్కాపురం: సనాతన హిందూ ధర్మాన్ని డెంగీ, మలేరియాతో పోల్చుతూ అవమానించిన డీఎంకే మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను వెంటనే అరెస్టు చేయాలని, ఆయన తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని హిందువులకు క్షమాపణ చెప్పాలని కోరుతూ హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. చెన్నకేశవస్వామి గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ.. నాలుగు మండపాల్లో జరిగింది. స్టాలిన్ ఫ్లెక్సీకి చెప్పులదండ వేసి నల్ల జెండాలతో నిరసన తెలిపారు. కోట్లాది మంది ప్రజలు నమ్మి అనుసరిస్తున్న సనాతన ధర్మాన్ని అవమానించేలా మాట్లాడిన ఉదయనిధి స్టాలిన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు పీఎల్‌పీ యాదవ్, గుంటక వనజాక్షి, వెంకటేశ్వరరెడ్డి, పీవీ కృష్ణారావు, శ్రీధర సుబ్బు, రంగస్వామి గౌడ్, హరిహరరావు, వీరారావు, అపర్ణ, శాసనాల సరోజినీ, ఎం.లక్ష్మి, రాజ్యలక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన లక్ష్మయ్య

పెద్దారవీడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి రోడ్డుపై నడిచి వెళ్తున్న గేదేలను ఢీకొట్టడంతో అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దేవరాజుగట్టు శ్రీకాశినాయన ఆశ్రమం సమీపంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపి వివరాల ప్రకారం.. పెద్దారవీడు సచివాలయం పరిధి సిద్ధినాయునిపల్లె గ్రామానికి చెందిన మెడతోటి లక్ష్మయ్య ద్విచక్ర వాహనంపై మార్కాపురం నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. కాశినాయన ఆశ్రమం సమీపంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న గేదేలు కనిపించక పోవడంతో ఢీకొని అదుపుతప్పి కిందపడిన లక్ష్మయ్య ముఖానికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని మార్కాపురంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

సచివాలయాల నిర్మాణ పనుల్లో నాణ్యత భేష్


ముండ్లమూరులో సిబ్బందికి సూచనలిస్తున్న ఇంజినీరింగ్ చీఫ్ బాలునాయక్

ముండ్లమూరు: మండలంలోని సచివాలయ భవనాల నిర్మాణాల్లో నాణ్యత సంతృప్తికరంగా ఉందని పంచాయతీరాజ్ రాష్ట్ర ఇంజినీరింగ్ చీఫ్ పి.బాలునాయక్ అన్నారు. మండలంలోని శంకరాపురం, ముండ్లమూరు, పసుపుగల్లు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల భవనాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులలో నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపట్టారన్నారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేయించడంపై సిబ్బంది పనితీరును మెచ్చుకున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి నిర్దేశిత సమయానికి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. నిర్మాణ సమయంలో పనులను నిత్యం పర్యవేక్షించి తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయా కార్యక్రమాలలో ఆయన వెంట పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ కొండయ్య, ఈఈ కోటేశ్వరరావు, ఏఈ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 643 కేసుల పరిష్కారం


కేసులు పరిష్కరిస్తున్న జడ్జి

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని 6వ అదనపు జిల్లా న్యాయస్థానంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 643 కేసులు పరిష్కారమైనట్లు మండల న్యాయ సేవాదికార సంస్థ అధ్యక్షులు, 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి తెలిపారు. ఇందులో పరిహారంగా కక్షిదారులకు 21 లక్షల 14 వేల 618 రూపాయలు ఇప్పించినట్లు తెలిపారు. సివిల్, క్రిమినల్, గృహహింస, ఎస్‌టీసీ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్‌అదాలత్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిలు పి.సత్యవాణి, బి.దేవేందర్‌రెడ్డి, ద్వితీయశ్రేణి మేజిస్ట్రేట్ ఎస్.కుమారి, న్యాయవాదులు టి.కాశయ్య, కరీమున్నీసాబేగమ్‌లు బెంచ్ సభ్యులుగా వ్యవహరించి కేసును పరిష్కరించినట్లు తెలిపారు.

గిద్దలేరులో 1931 కేసులు..

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కోర్టు ఆవరణలో అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరి శారాదానమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1931 కేసులు పరిష్కరించారు. అందులో సివిల్ కేసులు13, క్రిమినల్ కేసులు 170, చెక్ బౌన్స్ కేసులు 9, మనోవర్తి కేసులు 10, డీవీసీ కేసులు 3, పెట్టి కేసులు 1714, బీఎస్ఎన్ఎల్ టెలీఫోన్ కేసులు 12 మొత్తం 1931 కేసులు పరిష్కరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల కక్షిదారులు పాల్గొని వారి కేసుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గం ద్వారా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాల్సిందిగా ఆమె కోరారు. న్యాయవాదులు పిచ్చయ్య యాదవ్, ఆనంద్ కుమార్, పారా లీగల్ వలంటరీ మధు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కొనకనమిట్ల: ప్రస్తుత సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ఎస్పీ బాలయ్య అన్నారు. శనివారం మండలంలోని గనివానిపాడులో 104 వాహనం ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందించారు. ప్రజలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇంటి ముందు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. సర్పంచ్ పావులూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజీ చేసుకుంటే ఇబ్బందులుండవ్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జీఎల్‌వీ సరస్వతి

దర్శి: కేసుల్లో ఇబ్బందులు పడుతూ కోర్టులు చుట్టూ తిరగకుండా రాజీ చేసుకుంటే ఇద్దరికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని జూనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అన్నారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సరస్వతి మాట్లాడుతూ కోర్టులు చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకుండా రాజీ చేసుకుంటే ఇద్దరూ గెలిచినట్లే అవుతుందన్నారు. రాజీ అంటే రాజమార్గం లాంటిదని చెప్పారు. క్షణకాలిక ఆవేశంలో జరిగిన తప్పులకు క్షమాగుణంతో రాజీ మార్గం ఎంచుకోవాలని సూచించారు. అనంతరం 148 క్రిమినల్ కేసులు, 8 సివిల్ కేసులు, జూన్ నెల నుండి ఇప్పటి వరకు 606పెట్టీ కేసులు రాజీలు చేశారు. కార్యక్రమంలో సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ బొటుకు గంగాధర్, న్యాయవాదులు బి.చెన్నకేశవులు, ఎం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు


రామదూత క్షేత్రంలో హోమాలు చేస్తున్న భక్తులు

కొనకనమిట్ల: శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలమం, కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో విశేష పూజలు చేశారు. వెలుగొండలో శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మి అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా..గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకలు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

రామదూత క్షేత్రంలో..

కొనకనమిట్లలోని రామదూత క్షేత్రంలోని శనీశ్వరాలయంలో శనివారం ప్రత్యేక హోమాలు జరిపించారు. శనీశ్వరునికి తైలాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ వేదపండితులు అకలంకం వెంకటకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉభయదాతలు యక్కంటి తురుపతిరెడ్డి, ఒద్దుల చలమారెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు.

పది రోజుల్లో తొలగించకుంటే చర్యలు


ఇంటి దారి ప్రాంతాన్ని పరిశీలించి విచారిస్తున్న తహసీల్దార్ జ్వాలానరసింహం

కురిచేడు: స్థానిక వీరన్న స్వామి గుడి వద్ద 8–152 ఇంటికి వెళ్లే దారిలో నిర్మించిన బాత్‌రూంలు పదిరోజుల్లో తొలగించాలని, లేకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ జ్వాలానరసింహం హెచ్చరించారు. ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఆ నివాసానికి వెళ్లి పరిశీలించారు. దారికి అడ్డుగా బాత్‌రూంలు నిర్మించిన విషయాన్ని గమనించారు. విషయాన్ని చుట్టుపక్కల వారిని విచారించారు. అనంతరం రాంబాబు ఇంటికి వెళ్లేందుకు దారికి అడ్డుపడితే చట్టపరమైన చర్యలు తప్పవని, దారి ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఫిర్యాది రాంబాబు, సర్వేయర్, వీఆర్వో, సిబ్బంది ఉన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు


గర్భిణులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి మధుశంకర్

ముండ్లమూరు: ప్రధాన మంత్రి మాతృత్వ వందనం కార్యక్రమం ద్వారా గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని మారెళ్ల వైద్యాధికారి బి.మధుశంకర్ తెలిపారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 21 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. అవసరమైతే వారి కుటుంబసభ్యులకు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేపించుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది వెంకట్రావు, కేఎల్‌రాజు, ఎస్‌కెఎంఎం సుభాని, గర్భవతులు పాల్గొన్నారు.

అఖండ భజన కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దేవస్థానం నిర్వాహకులు

యర్రగొండపాలెం: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీన సీగానమే నాప్రాణం అంఖండ భజన కార్యక్రమం కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అఖండ భజన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి గురుస్వాములు, అయ్యప్ప భక్తులు, ప్రముఖ గాయకులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. భజన బృందాలు భజన పాటలు మాత్రమే పాడాలని, ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, కార్యక్రమంలో పాల్గొనే ఉత్సాహవంతులు సెల్: 94406 46641, 94404 86901 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. 15వ తేదీ ఉదయం 5 గంటలకు ధ్వజారోహణం, స్వదేశీ గోపూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన, అఖండ నామ సంకీర్తన లాంటి కార్యక్రమాలు రాత్రి 9 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆ కమిటీ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, కందూరి రామయ్య, యక్కలి భాగ్యారావు, కందూరి కాశీనాథ్, పబ్బిశెట్టి శ్రీనివాస్, ఎం.సుబ్బారావు, వై.వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రయ్య, కొత్తమాసు కిష్టయ్య, సూరె వెంకటస్వామి, హనుమంతరావు, టి.వీరాచారి పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

దర్శి: మునగా కోటిరత్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మునగా నరశింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఎస్ కళ్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందించి మందులు అందజేస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాదయాత్ర సభకు తరలి రావాలి


మాట్లాడుతున్న రమేష్

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలో సీపీఎం ప్రచార పాదయాత్ర ఆదివారం ప్రారంభమవుతుందని, మండల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రమేష్ కోరారు. మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జాత ప్రారంభించి 300 కిమీ 14 రోజులు నిర్దిష్ట సూచనలతో పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. దొనకొండలో పాదయాత్ర ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు పెనుమల్లి మధు హాజరవుతారని మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య తెలిపారు.